



1984 చక్రపాణి మొదటి అవార్డు పొందిన కథ

రాఘవరావు తనకు న్యాయంగా దొరికే కడిగిపెట్టిన రాళ్ళు తప్ప చిలకకొట్టు రాబడికోసం ఏనాడూ చేయిజాపి ఎరగడు— అతని మనస్సు అటువంటి పనులకు ఒప్పుకోదు. అందువల్లనే రాష్ట్రప్రభుత్వం సెక్రటేరియట్‌లో పెద్ద హోదా ఉద్యోగంలోనే ఉన్నా ఉద్యోగరీత్యా వెళ్ళవలసి వచ్చినప్పుడు తప్ప ఫస్ట్‌క్లాస్ రైలుపెట్టె మొహం చూడడు — చూసే స్తోమత లేదు కూడా.

పెద్దకూతురు శ్యామల పెళ్ళిసంబంధాల కోసం కాళ్ళరిగిపోయేట్లు తిరుగుతూ విజయవాడనుండి శ్రీకాకుళం ప్రయాణం చేస్తున్నాడు. మద్రాసు – హౌరా మెయిల్ సెకండ్‌క్లాస్ త్రీటయర్ స్లీపర్ కోచ్‌లో ఆరోజు అతడు.

అసలే ఆలస్యంగా నడుస్తున్న ఆ రైలు వాల్తేరు స్టేషనులో మరింతసేపు ఉండిపోవడంతో, అతడు పెట్టెదిగి ప్లాట్‌ఫారంమీద అటూ ఇటూ పచార్లుచేయడం మొదలుపెట్టాడు.

పబ్లిక్ సెక్టర్ ఆఫీసులలో పనిచేసే నాలుగోశ్రేణి ఉద్యోగికే పది పదిహేను వేలు కట్నాలు క్రుమ్మరిస్తున్న ఈ రోజుల్లో శ్యామలకోసం అధమపక్షం నలభై వేలన్నా పోస్తేగాని పెళ్ళిసంబంధం కుదిరేటట్లు లేదు. ఈ భారం ఎలాగైనా తీర్చుకోవడం అతని ప్రస్తుత సమస్య.

సెంట్రల్ ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్‌లో డెప్యూటీ సూపరింటెండెంట్‌గా ఉన్న అతని బావమరిది రాజమోహన్ ఈమధ్య అన్నాడు—'మీ రిలా ఏమిటండి మరీ బావగారూ! అన్నిటికీ మడికట్టుకు కూచుంటే పనులు అవుతాయా! హవుస్‌సర్జన్ చేస్తున్న మన్మధుడులాటి కొడుకు ఉన్నాడాయె— ఇంకా దిక్కులు చూడడమా! ఈ చేత్తో ఏభైవేలు పుచ్చుకుని ఆ చేత్తో ఇచ్చేస్తే పోలా!'

రాజమోహన్ సిద్ధాంతాల దృష్ట్యా ఆ దారిలో వెళ్ళడం సబబే-సమస్యకి సమాధానం ఒక చిటికెలో దొరుకుతుంది. కాని అటువైపు ఒక అడుగువేస్తే గుండెలలో కసుక్కున ముల్లు గ్రుచ్చుకుపోయే మనఃప్రవృత్తి గల రాఘవరావుకు అటువైపు చూపు వెళ్ళడంలేదు. తనకున్న ఆస్తి అంతా గుడివాడలో తాతగారు గడించిపెట్టి వదిలివెళ్ళిన పాత పెంకుటిల్లూ, దాని ఆవరణా మటుకే అదే అతని మన్ననలో మెదులూండి ఇప్పుడు ఆ ఇంటికీ అతనికీ సెంటిమెంటులో అనుబంధం చాలా ఉంది— తాను అక్కడే మొదటిసారి కళ్ళు తెరిచాడు. తన తల్లీ, తండ్రీ, అన్నా, మేనత్త – తల్లిలేని తనని పెంచి పెద్ద చేసింది ఆవిడే— అందరూ ఆ ఇంట్లోనే ఆఖరిసారి ఊపిరి తీశారు. తాను కూడా ఆ పని ఆ ఇంట్లోనే చెయ్యాలని అతని కోరిక. కాని శ్యామల పెళ్ళిచేయాలంటే

అది అమ్మడం తప్ప గత్యంతరం లేదు. తన కోరిక కోరికలాగే ఉండిపోతుంది. నెరవేరకుండా- అసలు ఆ ఇల్లు అమ్మిన అయిదారు నెలలకు పాత పెంకుటిల్లు పడగొట్టి మూడు నాలుగు అంతస్తుల భవనం నిలుపుతారు అది కొనుక్కొన్న శ్రీమంతులు.

ఈ ఆలోచనలో నొసలు చిట్లించు కొని ఉన్న రాఘవరావు ఎవరో గట్టిగా 'సార్, సార్' అని పిలవడం విని ఆలో చన తెగిపోయి వెనుకకు తిరిగి చూశాడు. తెల్లగా, భారీగా, అంత పొడవుగా, ఖరీదైన సూటు వేసుకుని గాగుల్స్ పెట్టుకుని ఉన్న ఆ మనిషిని చూసి పోలిక పట్టలేక తనను కాదనుకుని మళ్ళా ముందువైపు అతడు తిరగబోతుండగా ఆ వ్యక్తి 'తమరినే సార్' అంటూ వడివడిగా అతని దగ్గరకు వచ్చి వినయంగా నమస్కారం పెట్టి అన్నాడు. 'నేను వెటరీనరీ డాక్టర్ మాధవరావును సార్! మీరీ జిల్లాలో పదేళ్ళ క్రిందట మల్టీపర్పస్ ట్రైబల్ డెవలప్‌మెంట్ స్పెషల్ ప్రాజెక్టు ఆఫీసరుగా ఉన్నప్పుడు తమరికింద పనిచేశాను.'

మాధవరావు! బి.వి.యస్‌సి. ఎండ్ ఏ.హెచ్. కొత్తగా పాసై ఉద్యోగానికి వచ్చిన ఆ రోజుల్లో సన్నగా, దుర్బలంగా ఊపిరి ప్రాణం లేకుండా ఉండే మాధవరావు!

'ఓ, నువ్వా? సారీ పరధ్యానంగా ఉండి గుర్తుపట్టలేకపోయాను. ఎక్కడున్నావ్ ఇప్పుడు? పెళ్ళయిందా? పిల్లలెంత మంది?'

'ఈ మధ్యనే అయింది సార్. రాజాంలో ఉంటున్నాను.' అని రాఘవ రావును కుశలప్రశ్నలు వేసి వివరాలు కనుక్కొన్న తర్వాత అన్నాడు మాధవ రావు.

'మా మిసెస్ కూడా ఉంది సార్ ఈ మెయిల్లో. ఒక్కసారి తమరు వచ్చి మమ్ములను ఆశీర్వదిస్తే ధన్యులమవుతాం. రండి సార్- ఆఁ, ఏ పెట్టెలో ఉన్నారు? సామాన్లు ఎక్కువ ఉన్నాయా? కూలీని పిలుస్తా నుండండి. విజయనగరంవరకు కలిసివెళ్దాం. అక్కడ దిగుతాం మేము.'

'లేదు ఒక బాగే - ఇక్కడే ఈ త్రీటయర్‌లో,' ఆశీర్వదించటానికి రమ్మన్నప్పుడు వెళ్ళకపోవడం బావుండదని తన పెట్టెలోనికి బాగ్‌కోసం రాఘవరావు వెళ్తూండగా మాధవరావు అతని వెనుకే వెళ్ళి అతనికంటే ముందు తానే ఆ బాగ్ తీసుకుని 'రండి సార్....' అని దారి తీశాడు.

ఫస్ట్‌క్లాస్ కంపార్టుమెంటు ముందు నిలబడిఉన్న కండక్టర్‌కు ఏదో చెప్పి జేబులోనుండి ఒక నోటుతీసి అతనికిచ్చి

రాఘవరావుని లోపలికి తీసుకువెళ్ళి తన భార్యకు పరిచయంచేశాడు అతడు.

మాధవరావు భార్య నిర్మల పేరుకు తగ్గట్టుగానే నిర్మలంగా అందంగా కనిపిస్తోంది. కంజీవరం పట్టుచీర కట్టుకున్న ఆ అమ్మాయి ఒంటిమీద ఆభరణాలు ఏటవాలుగా వచ్చిపడుతున్న ఎండ వెలుగులో తళతళా మెరిసిపోతున్నాయి. అక్కడ పేర్చిఉన్న లగేజెస్ అన్నీ చాలా ఖరీదైనవిగానే కనిపించాయి, ఒక మంచి సూట్‌కేస్ కొనుక్కునే తాహతు కూడా లేని రాఘవరావు కళ్ళకు.

నిర్మల ఒక డొనేషన్ కాలేజిలో ఎం.బి.బి.ఎస్. చదివి హౌస్‌సర్జన్‌షిప్ పూర్తిచేసిందట. వాళ్ళ అన్న కెనడాలో ఇంజనీరు. అతని సాయంతో ఆమెకు అక్కడ పైచదువు చదివే అవకాశం లభించిందట. మాధవరావుకూ ఏదో ఉద్యోగం దొరికిందట. ఇద్దరూ నెలా రెండు నెలల్లో ఇండియా విడిచిపెట్టి వెళ్తారట.

రాఘవరావు వద్దంటున్నా వినక రెస్టారెంటునుండి ఆర్డర్‌చేసి తెప్పించిన టోస్టూ కాఫీతోపాటు తమ బాస్కెట్ నుండి జీడిపప్పు, పళ్ళూ, బిస్కట్లూ తీసి మూడు ప్లేట్లలో సర్ది ఒక ప్లేట్ అతనికిచ్చాడు మాధవరావు. తప్పనిసరిగా అది అందుకున్నాడు రాఘవరావు.

అది తింటువున్నప్పుడు మాటల సందర్భంలో మాధవరావు అన్నాడు.

'మేమిలా కెనడా వెళ్ళగలగడానికి తమ దయే కారణం సార్.'

మామూలుగా ఆమాట అతడు అంటున్నాడనుకొని చిన్న చిరునవ్వు నవ్వి రాఘవరావు అన్నాడు. 'అంతా ఆ దేవుడి దయ మాధవరావు....'

కాఫీ కలుపుతూ అన్నాడు మాధవరావు. 'దేవుడి దయతోపాటు తమవంటి వారి చలవచూపు కూడా ఉండాలి సార్ వినాటానికి....' అని ఆగిపోయి భార్యవైపు చూసి చిరునవ్వుతో అన్నాడు. 'నువ్వూ ఈ సంగతి వినలే ఇదివరకు_'

రాఘవరావు ఆశ్చర్యంగా చూశాడు మాధవరావు మొహం. అతడు రాఘవరావువైపు తిరిగి అన్నాడు. 'అప్పుడిక్కడ ప్రాజెక్టుకి చీఫ్ సెక్రెటరీగారు వచ్చారు కదూ సార్.... .... ....'

* * *

జమీందారీ రద్దు చట్టంక్రింద జమీందారీ ప్రభుత్వాధీనం అయిన తర్వాత తూర్పుగోదావరి జిల్లాలోని మణిపేట జమీందార్_ రాజా మహేశ్వరనారాయణం గారికి తాతగారి కాలంనుండి దివాణం ఏనుగులసాలలో ఉన్న మూడు ఏనుగులను ఎలా పోషించాలీ అన్నది సమస్యగా మారింది. అందులో ఒక ఏనుగు మొదటి

నుండీ వెంకటేశ్వరాలయంలో పూజా పునస్కారాలలోనూ, ఊరేగింపులలోనూ పాల్గొంటూ ఉండడంవల్ల దానిని దేవస్థానం ధర్మకర్తలకు అంటగట్టగలిగాడు ఎలాగో.

మిగిలిన రెండేనుగుల్నీ మావటీలతో ఊళ్ళమీదికి పంపి వినోద ప్రదర్శనలు చేయించీ, పిల్లలను ఎక్కించి త్రిప్పి వాటి ఆహారంఖర్చు అవి తెచ్చుకునే ప్రయత్నాలు చేసాడు కొన్నాళ్ళపాటు ఆ రాణావారు—నిరర్థకంగా. ఎలానో ఒక సర్కస్ కంపెనీకి ఒక ఏనుగును—అన్నిటిలోనూ చిన్నదాన్ని అమ్మాడు చివరకు.

ఇంక మూడవ ఏనుగు ఉండిపోయింది.

ఒకసారి ఆ ఊరికి మంత్రిగారు ఒకరు వస్తున్నారని విన్నప్పుడు మహేశ్వరరాయణంగారికి మెరపులాగ ఒక ఊహ స్ఫురించింది.

మంత్రిగారు వచ్చేరోజున ఉదయమే మావటీవాడు ఆ ఏనుగును తీసుకెళ్ళి శుభ్రంగా ఏటిలో స్నానంచేయించి దాని ఒంటినిండా గంధంరంగు పౌడర్‌తో వింత వింత డిజైన్ల ఆలంకరణచేసి పట్టె నామాలు తీర్చిదిద్దాడు. దానికున్న ఆభరణాలన్నీ పైకితీసి అలంకరించాడు. జలతారు అంచులతో మెరిసిపోతున్న ముఖమల్ తివాచీ ఒకటి ఆ ఏనుగు వీపుమీద చక్కగా పరిచాడు.

తనని రిసీవుచేసుకోడానికి రోడ్డుకడ్డుగా నిలబడ్డ మనుషుల గుంపుముందు సర్వాలంకృతమై ఉన్న సీమంతినిని—అది ఆ ఏనుగు పేరు—చూసి ఆశ్చర్యపడ్డ మంత్రిగారు కారు ఆపించారు. ఒకప్పుడు తన దివాణం ఆఫీసులోనే గుమాస్తాగా పనిచేసి ఇప్పుడు సర్పంచ్‌గా ఉన్న చంద్రయ్యతో పాటు మహేశ్వరరాయణంగారు కారుదగ్గరకు వెళ్ళి మంత్రిగారికి నమస్కారం పెట్టి ఏదో మాట్లాడి ఆయనను ఏనుగు దగ్గరకు తీసుకు వచ్చాడు.

మావటీ చేతిలో ఉన్న పెద్ద పూలదండ తొండంతో అందుకుని సవిలాసంగా దాన్ని మంత్రిగారి మెడలోవేసి 'నమస్కారం' అన్నట్టు సన్నగా ఘీంకరించి సీమంతిని ముందుకాళ్లు వంచి సగం కూర్చుని మంత్రిగారికి తొండం పైకెత్తి దండంపెట్టింది. ఒక్కసారిగా తనని ఎవరో ఆకాశంమీదికి ఎత్తినట్లుగా అనుభవం కలిగింది మంత్రిగారికి.

అంతవరకూ ప్రతిపక్షంలో ఉండి తన మనిషినే ఎం.ఎల్.ఏ.గా గెలిపిస్తూ వచ్చిన మహేశ్వరరాయణంగారు ఆ రోజు సాయంత్రం బహిరంగ సభలో హఠాత్తుగా వేదికమీద నిలబడి రాష్ట్రంలోని అధికారపక్షంలో తాను, తన అనుచరులతోపాటు చేర్తున్నట్లుగా ప్రకటన

చేశాడు. అందరూ కరతాళ ధ్వనులు చేస్తుండగా, అనుకోని విజయం ఆ ప్రాంతంలో లభించినందుకు పొంగిపోయిన మంత్రిగారు లేచి నిలబడి రాయణంగారికి తమ పక్షంతరఫున స్వాగతం చెప్పి ఆయన ఆ ప్రాంతంలో చేస్తున్న ప్రజా సేవను బహుధా ప్రశంసించాడు. ఆ తరువాత తన ప్రసంగం కొనసాగిస్తూ రాయణంగారు మధ్యలో మంత్రిగారివైపు తిరిగి చిరునవ్వులు చిందిపోయే మొహంతో అన్నాడు:

'నా మీద గౌరవనీయులైన మంత్రి మహాశయులు ఇంత గాఢమైన సదభిప్రాయం ప్రకటించినందుకు కృతజ్ఞతా సూచకంగా మా ఈ సీమంతిని మన రాష్ట్ర ప్రభుత్వానికి బహూకరిస్తున్నాను ఇప్పుడు.' రాయణంగారి చేయి వేదికకు ఒక ప్రక్కగా ఉన్న ఏనుగువైపు వెళ్ళింది.

సీమంతిని అంటే ఏమిటో తెలియని మంత్రిగారు ఆ చేయి చాచిఉన్న వైపు చూశాడు. సరిగ్గా అదే సమయానికి సీమంతిని తొండం పైకెత్తి మావటీడు అంతకుముందు చేసిన ఆదేశానికి ఏనుగు జంగా గట్టిగా ఘీంకరించింది. ముంచు తృళ్ళిపడ్డాడు మంత్రిగారు. కాని తర్వాత తన పెర్సనల్ అసిస్టెంట్ చెవిలో ఊదింది బోధపరుచుకుని, ఈ బహూమతిలో ఉన్న అంతరార్థం తెలియని అమాయకుడు కనుక మళ్ళీ పొంగిపోయి రబ్బరు బూరలా ఆయి లేచినిలబడి సీమంతినిని ఆ క్షణంనుండీ ప్రభుత్వాధీనంలోకి తీసుకుంటున్నట్లు ప్రకటించి రాయణంగారికి ప్రభుత్వం తరఫున కృతజ్ఞత తెలియచేశాడు.

* * *

ఈ సంగతి విన్నప్పుడు ముందు ముఖ్యమంత్రిగారు మంత్రిగారిమీద విసుక్కున్నాడు—అయితే మణిపేట నియోజక వర్గం తనపక్షం గుప్పిటిలోకి వచ్చినందుకు కలిగిన సంతోషంతో కొంత శాంతించి ముఖ్య అతిథులు రాష్ట్ర సందర్శనానికి వచ్చినప్పుడు స్వాగతంచెప్పే ప్రొటోకాల్ (లాంఛనాలు) వ్యవహారాల్లో ఏనుగు పనికివస్తుందనీ, ఆ ప్రొటోకాల్ విభాగం తనక్రిందే ఉంది కనుక ఏనుగు పోషణ వగైరాలు తననే చూసుకొమ్మనీ మంత్రిగారిని ఆదేశించాడు.

తమ విభాగంలో ఉన్న జీపులూ, కార్లూ, వాన్లూ త్రాగేస్తున్న పి.ఓ యల్. (పెట్రోలు ఆది చమురు పదార్థాలు)కే బడ్జెట్‌లో డబ్బు చాలకుండా బాధపడుతున్న సెక్రెటరీ మంత్రిగారికి సాధకబాధకాలు వివరించి సీమంతినిని ఫారెస్టు డిపార్టుమెంటు క్రిందికి పంపితే మంచిదని సలహా ఇచ్చాడు. అయితే ఫారెస్టువాళ్ళు సీమం

తిని పోషణభారం వహించేందుకు అంగీక రించకపోవడంతో వర్క్స్ డిపార్టు మెంటుకూ, వెటరినరీ డిపార్టుమెంటుకూ ఆ భారం అప్పచెప్పడానికి ఆ సెక్రెటరీ ప్రయత్నించాడు. కాని ఆ విభాగాలవాళ్లూ దానికి అంగీకరించకపోవడంతో ఈ వ్యవహారానికి సంబంధించిన ఫైలు చీఫ్ సెక్రెటరీగారి దగ్గరకు వెళ్ళింది. అంత వరకు ఈ ఏనుగు వ్యవహారం తన దృష్టికి రాని ఆయన ఆశ్చర్యపడ్డాడు. సెక్రెటరీని వచ్చి స్వయంగా మాట్లాడ మని ఫైలుమీద ఆర్డర్ వేశాడు.

ఆ తరువాత వారం రోజులకు చీఫ్ సెక్రెటరీ బాధ్యతతో పాటు రాష్ట్రానికి డెవలప్‌మెంట్ కమీషనర్‌గా కూడా వ్యవహరిస్తున్న ఆయన రాఘవరావు ప్రాజెక్ట్ ఆఫీసర్‌గా ఉన్న ప్రాంతానికి అక్కడి కార్యకలాపాల తనిఖీకి టూర్ వెళ్ళాడు.

ఆ ప్రాంతం అంతా అడవులూ, కొండలూ ఉన్న మన్యం.

ప్రాజెక్ట్ స్టాఫ్ అందరూ ఉన్న సభలో ప్రాజెక్ట్‌లోని సాధకబాధకాల్ని సమీ క్షిస్తున్నాడు చీఫ్‌సెక్రెటరీ. రోడ్లు సరిగా లేకపోవడంవలన లోయలలోఉన్న చాలా ఊళ్ళకు జీపులమీద చేరుకోవడం సాధ్యం కావటంలేదనీ, పైగా వన్యజంతు భయం ఎక్కువగా ఉందనీ విన్నప్పుడు చీఫ్ సెక్రెటరీకి ఒక ఊహ తట్టింది.

ప్రాజెక్ట్ ఆఫీసర్ చెప్పింది సావధా నంగా విని ఆ తర్వాత అన్నాడు ఆయన: 'వారం రోజులలో మీకు ఏనుగు ఒకటి పంపిస్తాను- స్టాఫ్ ఆ గ్రామాంతరాలన్నీ చేరుకోడానికి సదుపాయంగా ఉంటుంది.' ప్రాజెక్ట్‌కు డబ్బు పుష్కలంగా ఉంది కనుక సీమంతిని పోషణ సులభంగా ఇక్కడ జరుగుతుంది అనిపించింది ఆయనకు.

చీఫ్‌సెక్రెటరీగారు వేళాకోళం చేస్తున్నారేమో అనుకున్నాడు రాఘవరావు ముందు. కాని ఆ తర్వాత అది జోక్ కాదనీ నిజంగానే ఏనుగు ఒకటి ప్రాజెక్ట్ అధీనంలోనికి రాబోతుందనీ బోధపడింది అతనికి.

* * *

వెటరినరీ డాక్టర్ మాధవరావు పర్య వేక్షణలో ఆదరాబాదరాగా ఒక ఏనుగుల సాల తయారయింది. ప్రాజెక్ట్ హెడ్ క్వార్టర్స్‌లో దాని నిర్మాణం పూర్తి అయిననాటి సాయంత్రం రాజధాని నుండి గూడ్స్ వాగన్ లో ఎక్కి ప్రయాణంచేసి ఆ తర్వాత కాలినడకన నలభై కిలోమీటర్లు వచ్చిన సీమంతిని నూతన గృహప్రవేశం చేసింది.

ఎప్పుడో నెలలవయస్సులో మణిపేట దివాణం చేరుకున్న ఆ జీవానికి ఈ అడ వులూ, కొండలూ అంతా క్రొత్తగా కని

పిస్తున్నాయి. చీకటి పడినప్పటినుండి ఒకటే ఘీంకరింపు మొదలుపెట్టింది అది. ఎలాగో కష్టపడి కొంత ఆహారం తినిపించాడు దానిచేత మాధవరావు.

ఆ సాలకు కొద్దిదూరంలో ఒక షెడ్డులో నిద్రపోతున్న మావటీకి ఒక రాత్రి సీమంతిని పెడ్తున్న భయంకరమైన ఘీంకరింపులతో మెలకువ వచ్చింది. ఆ ఘీంకరింపులతో పాటు ఆ దగ్గరలోనే ఎక్కడో అడవిలో పులి గాండ్రింపు కూడా వినవస్తున్నది. బెదిరిపోయిన అతడు వణికిపోతూ, గుండెలు గడగడలాడ్తుండగా అతి కష్టంమీద ఎలాగో అక్కడికి దగ్గరగా ఉన్న వెటరినరీ డిస్పెన్సరీకి చేరుకొని మాధవరావును లేపాడు.

ఇద్దరూ కలిసి ఏనుగులసాల దగ్గరకు వచ్చేటప్పటికి కూలిపోయిఉన్న సాల నడుమ వెర్రెత్తినట్లుగా అటూ ఇటూ తిరుగుతూ తొండం పైకెత్తి ఘీంకరిస్తున్న ఏనుగు కనిపించింది - ఎంత ప్రయత్నించినా వినిపించుకోలేని కాలి గొలుసులతో, అనుభవం లేని మాధవరావు కట్టించిన ఆ సాల కప్పు, గోడగా ఉన్న దడులూ అందుబాటులో ఉన్నా ఏనుగు ఎప్పుడూ తాను వినని - పసితనంలో విన్నా స్మృతిలో నిలవని-పులి గాండ్రింపుతో హడిలిపోయి చేసిన భీభత్సాన్ని చూశారు వాళ్లు.

సీమంతినిని సమాధానపరచడానికి ప్రయత్నించాడు మావటీడు. ముందు సాధ్యం కాలేదు కాని చివరకు పులి గాండ్రింపు దూరంగా అయిపోయి మరి వినబడకపోవడంతో ఆ ఏనుగు ఘీంకరింపు మానింది. అయితే గాభరాగా అటూ ఇటూ తిరగడం మటుకు మానలేదు. ఇంక పని చేసేందుకు ఏమీలేక ఆ రాత్రికి మావటీడుని ఈ పశువులఆస్పత్రిలోనే పడుకోమని చెప్పి తనతోపాటు తీసుకుపోయాడు మాధవరావు.

ఏనుగు ఆగమనం గురించి టెలిగ్రాం అందిన కలెక్టర్‌గారి ఆదేశంలో జిల్లా వెటరినరీ ఎండ్ ఎనిమల్ హజ్బెండ్రీ ఆఫీసరు ఆ మర్నాటికి ప్రాజెక్ట్ హెడ్ క్వార్టర్స్ చేరుకున్నాడు. గత రాత్రి జరిగిన సంఘటన విన్న అతడు సీమంతిని కోసం స్థాయీ నివాసస్థానం ఏర్పాటు చేయడానికి తగిన ఆదేశాలు మాధవరావుకు ఇచ్చారు. అంతేకాకుండా ఏనుగు పోషణకూ, దాని ఆరోగ్యానికీ, ఎప్పుడన్నా సుస్తీచేస్తే చేయవలసిన వైద్యానికి సంబంధించిన విషయాల గురించి వివరంగా చెప్పి ఆ తరువాత ఎవరూ లేనప్పుడు మరికొన్ని లౌకికమైన చిట్కాల గురించి కూడా మాధవరావుకు బోధచేశాడు

కొన్నాళ్ళకు ఒక దుర్గమమైన కొండ లోయలో ఉన్న ఊరు వెళ్ళడానికి పశువుల డాక్టరూ, ఓవర్సీరూ, పంచాయతీ ఇన్స్పెక్టరూ, గిరిజన సంక్షేమశాఖ ఆఫీసరూ మొదటిసారిగా సీమంతినిమీద వేసిన అంబారీలో కూర్చొని మావటీతో పాటు టూర్ బయల్దేరారు.

కొంతవరకు ప్రయాణం సవ్యంగానే సాగింది. కాని సాయంత్రం సంజ చీకటిలో ఎక్కడో దూరంగా పులి గాండ్రింపు వినగానే సీమంతినికి తన మొదటిరాత్రి అనుభవం జ్ఞాపకంవచ్చి మళ్ళీ పట్టరాని భయంవేసింది. దానితో అది బెదిరిపోయి దారివదిలి అడ్డుదిడ్డుగా పరుగెత్తడంతో పైన కొమ్మలు తగిలి అంబారీ ఛిన్నాభిన్నం అయి నలుగురు ఆఫీసర్లూ క్రిందపడిపోయారు. అదృష్టవశాత్తూ ఎవరికీ గట్టిదెబ్బలు తగలలేదు- చిన్నచిన్న గాయాలు తప్ప.

అతి కష్టంమీద మావటీని సాయంతో మళ్ళీ ఎలాగో సీమంతినితోపాటు హెడ్ క్వార్టర్స్ చేరుకోగలిగారు మరునాటి సాయంత్రానికి వాళ్ళు

ఆ తరువాత ఎవళ్ళూ ఏనుగు ఎక్కి టూరుకు వెళ్ళడానికి సాహసించలేదు.

ఈ సంఘటన గురించి వివరంగా కలెక్టర్‌కు రాఘవరావు ఉత్తరం వ్రాసి ఏనుగు ప్రాజెక్ట్ కార్యకలాపాల్లో ఏ విధంగానూ సాయపడదనీ, దాన్ని ఉచితమైన స్థలానికి స్థానాంతరం చేయించమనీ కోరాడు.

కలెక్టరాఫీసువాళ్లు ఆ ఉత్తరం అందుకుని ఇంకా ఫైలులో పుటప్‌చేయకుండానే వర్షాకాలం మొదలైంది.


ఆ ప్రాజెక్ట్ ప్రాంతాల్లో ఒకసారి వాన మొదలుపెడితే వారంరోజులైనా అలా కుండపోతగా కురవడం తప్ప ఒక నిముషమన్నా మరి సూర్యదర్శనంకాదు.

అలాటి ఒక పెద్దవానతో సీమంతినికి జలుబుచేసి బాగా జ్వరం వచ్చింది.

ఫైలు మాధవరావు తన ముందు పెట్టిన మందులలిస్టు చూడగానే చాలా ఆశ్చర్యంవేసింది రాఘవరావుకు. మనుషుల జబ్బులు కుదర్చడానికి మామూలు ఈ హాస్పిటల్‌లో పదిరోజులపాటు వాడగలిగినన్ని మందులు వాటికయ్యే ఖర్చుకు పదిరెట్లు ఖర్చు ఎస్టిమేట్‌తో ప్రత్యక్షమయ్యాయి ఆ లిస్టులో.

'ఇవన్నీ కావాలా! మాధవరావ్!' అన్నాడు నెమ్మదిగా అతడు.

'కావాలి సార్ - అందుకే ఎలిఫెంటైన్ ప్రపోర్షన్స్ అంటారు. సీమంతిని పొజిషన్ చాలా సీరియస్‌గా ఉంది సార్- ఇమ్మీడియట్‌గా ట్రీట్‌మెంట్ మొదలు పెడ్తేనేకాని లేకపోతే పరిస్థితివిషమిస్తుంది



తాను తాత్సారంచేస్తే సీమంతిని కేమన్నా అయితే తన మీద నింద వస్తుంది— ఆ లిస్టు మంజూరుచేస్తే ఏదో గూడుపుఠాణీలో భాగస్వామి అవుతానేమో అని భయం ఒక ప్రక్క. ఏమీ పాలుపోలేదు ముందు రాఘవరావుకు. చివరకు వైద్యశాస్త్రరీత్యా సీమంతిని జబ్బుకోసం అవసరమైన మందులు కొని తేవలిసిందనీ, అయితే ఆ బిల్లు పాస్‌చేసే ముందు అన్ని వోచర్లూ జిల్లా వెటరినరీ ఆఫీసర్‌చేత కౌంటర్‌సైన్ (అంతా సవ్యంగా ఉంది అన్నట్లుగా సంతకం) చేయిస్తేనే డబ్బు ముట్టుతుందనీ ఆర్డర్ వేశాడు అతడు.

'అలాగే సార్ - అసలు ఆయన లోగడ నాకిచ్చిన సలహాలప్రకారమే ఈ లిస్ట్ తయారుచేశాను.' అన్నాడు మాధవరావు.

సీమంతిని ఆరోగ్యం వారానికి బాగుపడింది.

సీమంతినిని స్థానాంతరీకం చేయడం గురించి రాఘవరావు వ్రాసిన కాగితం మీద కలెక్టర్‌కు ప్రభుత్వానికి వ్రాసిన ఉత్తరం ఏమైందో ఎన్ని నెలలైనా తెలియకపోవడంతో రాఘవరావు రిమైండర్ల మీద రిమైండర్లు ఇవ్వడమూ, కలెక్టరు కూడా తనవంతుగా తానూ అదేపని చేయడమూ జరిగింది. చివరకు కలెక్టర్ గారి మొదటిఉత్తరం అందలేదనీ దాని నకలు పంపమనీ ప్రభుత్వంవారు కోరడమూ కలెక్టరు ఆ పనిచేయడమూ జరిగింది. కాని ఒకసారి ఏనుగు బరువు ఎలాగో వదుల్చుకున్నా ప్రభుత్వంవారు దాన్ని గురించి మరి పట్టించుకోలేదు. సీమంతినికి ఈలోగా చాలాసార్లు జబ్బు చేసింది.

రెండేళ్లు గడిచాయి. రాఘవరావు అక్కడినుండి బదిలీఅయి వెళ్ళిపోయాడు. అతడు వెళ్ళిన రెండునెలలకు మళ్ళీ జబ్బు చేసిన శ్రీమంతిని ఆ మన్యప్రాంతంలోనే కళ్ళుమూసింది శాశ్వతంగా.

* * *

'తమ దయవల్ల ఆ రెండేళ్ళలో శ్రీమంతిని మెడిసిన్ బిల్లులలో డయట్ (ఆహారం) బిల్లులలో పదిహేనువేల వరకూ మిగిలింది సార్. జిల్లా ఆఫీసర్ వారికి అయిదువేలిచ్చి మిగతాదంతా ఫిక్స్డ్ డిపాజిట్ చేశాను. ఇప్పటికి అరవై వేలు పైనే అయింది సార్. అదే నాకిప్పుడు కెనడాకి వెళ్ళడానికి సాయపడింది - తండ్రివంటివారు తమ దగ్గర దాపరికమెందుకు?'

ఒళ్ళంతా సూదులు గ్రుచ్చుకున్నట్లుగా ఉంది రాఘవరావుకు. అంతకుముందు లోపలికి వెళ్ళిన జీడిపప్పు, పళ్ళు, బిస్కట్లూ, రొట్టె, కాఫీ అంతా బావలా అంగా పైకి ఏ క్షణంలోనన్నా వాంతి రూపంలో వచ్చేలా ఉంది అతనికి. లేచి నిలబడి 'వస్తాను....' అన్నాడు, ట్రావెలోనికి వెళ్లిపోనిచ్చి వెనుకకూ ముందుకూ జరుపుతూ. విజయనగరం స్టేషన్‌లో ఆగిఉంది మెయిల్ అప్పుడు.


'వన్ మినిట్ సార్....' అని మాధవరావు పెళ్ళాం మొహందగ్గరకు వంగి చెవిలో ఏదో చెప్పి ఎదుటి బెర్త్ మీద ఉన్న పెట్టెతాళంతీసి ఏదో వస్తువు పైకితీసి కుడిగుప్పిటిలో పెట్టుకుని పెట్టె తాళంవేసి భార్యకు సైగచేశాడు.

దంపతులు ఇద్దరూ కలిసి తన కాళ్లు ముట్టుకుని కళ్ళకద్దుకుంటున్నప్పుడు ఏమని ఆశీర్వదించడానికి తోచలేదు రాఘవరావుకు. అతి కష్టంమీద 'శుభమస్తు' అన్నాడు.

మళ్ళీ మామూలుగా నిలబడిన మాధవరావు కుడిచేయి చాపి మూసిఉన్న గుప్పిటని తెరిచి వినయంగా అన్నాడు. 'దయతో ఇది స్వీకరించండి సార్— చిన్న మెమెంటో.'

రాఘవరావు వెర్రిగా ఆ అరచేతిలోని వస్తువును చూశాడు. అక్కడ ఒక వజ్రపు టుంగరం తళతళ మెరుస్తున్నది- కాశీమజిలీ కథలో నాగుబాము పడగమీది మణిలా, అధమపక్షం రెండువేల పైనే ఖరీదైనది అది. అతనికి నోట మాట రాలేదు. ఈ దోపిడీకి తనబాధ్యతా ఉంది— ఈ ఆలోచనే తిరుగుడుపడుతూ ఉంది అతని మనస్సులో.

మాధవరావు అంటున్నాడు: 'ఇది తమ వేలికి చిన్నదవుతుంది అమ్మగారి వేలికి సరిగా సరిపోతుంది. ఆవిడకు మా నమస్కారాలు చెప్పండి.'



'వద్దు–వద్దు. వస్తాను' అతి కష్టం మీద అని వెనుతిరిగి వడివడిగా గుమ్మం దగ్గరకు వెళ్ళాడు రాఘవరావు. తొందరగా తనూ వెనుకనే వస్తూ, 'నో సార్–డోంట్ రెఫ్యూజ్ సార్. కైండ్లీ ఆక్సెప్ట్ సార్.' అంటున్నాడు మాధవరావు.

ఆ మాటలు వినిపించుకోకుండా ఒక్క ఉదుటున మెట్లసాయం అవసరం లేకుండా క్రిందికి దిగి బాగ్‌తో తన కంపార్ట్‌మెంట్‌వైపు వెళ్ళిపోయాడు రాఘవరావు.

* * *

ఆ ప్రాజెక్ట్ అడవుల్లో ఇప్పటికీ చెల్లాచెదరై ఎక్కడో పడిఉంటాయి సీమంతిని పుర్రే, ఎముకలూ, దంతాలూ. అయితే ఆత్మ అన్నదే ఉంటే దాని ఆత్మ ఎక్కడో పైలోకాలలో ఉండి తన ఆహారంకోసం మందులకోసం వచ్చిన డబ్బు త్యాగంచేసి ఒక నూత్న వధూవరులను కేనడాకు వలసపంపడంలో సాయపడ్డాను అని తృప్తిపడుతూ ఉండవచ్చు.

అంతేకాదు– చాలామంది మానవుల అస్థికల అవశేషాలు ఎన్నో ఊళ్ళ శ్మశానాల్లో పడిఉంటాయి చెల్లాచెదరుగా. వాటిలో ఎంత [illegible] పాసల అస్తికలూ కలిసుంటాయి ఎన్నో హాస్పిటల్స్‌లో డాక్టర్‌గా పనిచేసి చివరికప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో ఒక జిల్లా హెడ్‌క్వార్టర్స్ హాస్పిటల్ సూపరింటెండెంట్‌గా ఉన్న ఒకవ్యక్తి కుమార్తె నిర్మల ఒంటిమీదా, ఆమె తల్లీ చెల్లెళ్ళ ఒంటిమీదా విలువైన ఆభరణాలు సమకూర్చడంలో తానూ చేసిన సాయం ఆ అస్థికల పూర్వపు సొంతదార్లయిన ఆత్మలలోనూ మెదిలి ఏదో తృప్తి కలిగిస్తూ ఉంటుందేమో!